19

# ఇద్దరు మనుషులు ఒక జీవితం

డాక్టర్ పార్థుడు గుండెల్లో దుఃఖం ఎగదన్నుకొస్తోంది. మౌనంగానే వెక్కెక్కి చిన్న పిల్లాడిలా ఏడుస్తూ-

ఎన్ని గంటలైందో అలా కూర్చుని.

ఈ చరాచర సృష్టిలోని ప్రతి అణువణువును శాసించేది "కాలం" కాలం. ప్రమేయం లేకుండా ప్రపంచంలోని ఏ విషయం గురించి మాట్లాడినా అది అసమగ్రమూ, తెలివి తక్కువతనమూ ఔతుంది. ఈ ఇల్లు కొత్తది.. ఇది పాతది.. రెఫరెన్స్ కాలమే... అని గణితశాస్త్రంలో " టైమ్ థియరీ" మీద డాక్టరేట్ చేసిన పార్థుడు టైమ్‌ను గమనించే స్థితిలో లేడు.

అప్పటికతను ఆ కొండరాయిపై, ఎదుట ఉన్న చెరువులోకి చూస్తూ కూర్చుని నాలుగున్నర గంటలైంది.

పార్థుడి చెంపలపై నుండి నీళ్ళు నిప్పుధారల్లా కారుతున్నాయి. ప్రక్కన ఒట్టి అలల శబ్దం. మిగతా అంతా వేదనలా నిశ్శబ్దం.

తన పుట్టుక నుండి... ఈ ప్రపంచంలో తనకున్న ఒకే ఒక మనిషి....

నాన్న -

తండ్రయి,

స్నేహితుడై,

గురువై,

హితుడై... దైవమై.

ఒక సహచరుడై,

మిస్టర్ శంభులింగ నరసింహస్వామి.....

పి.ఎస్.ఎల్.ఎన్. స్వామిగా అందరిచేత పిలవబడే ఒట్టి గుమాస్తా నాన్న,

తన కన్నీళ్ళు తుడిచి,

తన వెన్ను తట్టి, తనతో ఛాలెంజ్‌లు విసిరి, తను తన జీవితంలో కోల్పోయిన విద్యను, తనలో విశృంఖలంగా ఉద్దీపింపచేసి.... పార్థుని ఆపాదమస్తకం విద్య జలపాతంలా ప్రచండ నృత్యం చేయాలని,

కలలు కని, కలలు కని,

పస్తులుండీ పస్తులుండీ - ఫీజులుకట్టి ఫీజులు కట్టి,

ఎప్పుడూ ఏమని పిలిచేవాడు తనను - " మై ఫ్రెండ్ " అని. కొడుకును "మై ఫ్రెండ్" అని మహోన్నతంగా ఆత్మీయం చేసుకుని పిలిచి, తల నిమిరి, వెన్నుతట్టి, విశ్వాసపు ఊపిరులూది, ముందడుగు వేయించి మైదానం లోకి తనను పంపి - తను ప్రపంచమై, విద్యనే తనకు జీవితంగా ప్రసాదించి,

డిగ్రీలు

మాస్టర్ డిగ్రీలు

డాక్టరేట్

ఒక్కో మెట్టు ఎక్కి వస్తుంటే, "మై ఫ్రెండ్ అచీవ్ అచీవ్ అండ్ అచీవ్"అని కోటి ఏనుగుల బలాన్నందించిన నాన్న.

అనాటి రాత్రి అకస్మాత్తుగా చనిపోయిన తర్వాత

ఒట్టిచీకటి.

ఒట్టి శూన్యం

స్పేస్‌లో నుండి చటుక్కున భూ వాతావరణంలోకి ప్రవేశించినట్టు భయంకరమైన షాక్.

అనాటి నుండి స్వంత ఉనికి లేదు. ఒట్టి డిపెండెన్స్.

ఎన్ని అప్పులు చేశాడో, ఎన్ని ఆకలి రాత్రులను గడిపాడో, ఒకే పాంటు, ఒకే షర్టుతో ఎన్ని సంవత్సరాలు గడుపుకొచ్చాడో.

వెలుగు వెళ్ళిపోయాక చీకటి రాక్షసత్వం తెలుస్తోంది.

నాన్న పోయాక. ఒంటరిగా మిగిలి,

ఒంటరి ప్రపంచం ముందు ఏడుస్తున్న పసిబాలునిలా నిలబడి, -

ఏం చేయాలి...

ఎక్కడకు పోవాలి...

ఎలా బ్రతకాలి...

అని మొట్టమొదటిసారిగా పుస్తకాల్లోనుండి, గణిత మహాసముద్రాల్లోనుండి, విద్యా తపస్సులో నుండి, డిస్టింక్షన్సూ, గోల్డ్ మెడల్స్ నుండి కనురెప్పల్ని పర్వత భారాల్లా ఎత్తితే-

లోకం కుళ్ళిపోయికనిపించి,

సంఘం అవినీతిలో కూరుకుపోయి కనిపించి,

దుఃఖం...

దుఃఖం.... అగ్ని ప్రవాహంలా,

మహోధృతమైన ఉప్పెనలా తన్నుకుని తన్నుకుని...

గుండెలవిసిపోతున్నాయి.

కడుపునిండా ఆకలి....

కళ్ళనిండా కన్నీళ్ళు....

ఖాళీ జేబులు..

శూన్యమైన వీధులు...

గమ్యం లేని నడకతో అలసిన పాదాలు

వాట్ టు డు.. ఏంజేయాలి.

ఏదోఒకటి చేయాలి

బట్.. ఏమిటా ఒకటి... ఏమిటి..... ఏమిటి..

'మై ఫ్రెండ్.. ఆకలి...ఆకలి...'

విద్యనేర్పావు. .... బ్రతకడం నేర్పలేదు.

డిగ్రీలను, గోల్డ్ మెడల్స్, పి.హెచ్.డి.లను

ఏంచేయాలి...నాన్నా..ఆకలవుతోంది.

అమ్మా

ఆకలవుతోంది...

డాక్టరేట్ చేసినవానికి నూర్రూపాయల జీతమిచ్చి ప్రైవేట్ పాఠశాలలు నడిపే నాన్‌మెట్రిక్యులేట్ లంజాకొడుకులు అ.ఆల. పాఠాలు చెప్పమని తరిమి తరిమి కొడ్తుంటే

అమ్మా ఆకలి..

కన్నీళ్ళు..కన్నీళ్ళు...

బట్‌వాట్ టూ డూ

ఎన్నాళ్ళీ దుఃఖం...

మోకాళ్ళ మీద నుండి తలెత్తాడు పార్థుడు. ఎండ మండిపోతోంది. నెత్తి మాడిపోవడం తెలుస్తోంది.

చుట్టూ కొండల్లోనుండి కూలీలు రాళ్ళు కొడ్తున్న చప్పుడు వినబడ్తోంది. అస్తవ్యస్తతలో కొట్టుకుని నిర్థిష్టమైన నిర్ణయంతో ఆకృతి ధరించాలని ఉబలాటపడ్తున్న హృదయం కొత్త ఊపిరినూదుతోంది.

పార్థుడు లేచి నిలబడ్తూండగా...

అతని వెనుక ఎవరో ఓ మనిషినీడ చల్లగా పైన బడింది.

తలెత్తి చూశాడు.

ఓ స్త్రీ. అందమైన పాతికేళ్ళలోపు, పాలరాతి బొమ్మలాంటి స్త్రీ.

చిర్నవ్వు, చూపుల్లో ఒట్టి స్వచ్ఛత. వస్తోంది తన వైపే.

ఎవరీమె.. ఎప్పుడూ చూడలేదిదివరకు. ఎవరికోసమిటు వస్తోంది.

చుట్టూ చూశాడు- యింకెవరైనా ఉన్నారా అని. ఉహుఁ.

తనకోసమే.

" నమస్తే.."

" చేతులు జోడించాడు"

"నా పేరు జయ- ఎమ్మెస్సీ మాథ్స్...'

'........'నేనెవరో మీకు తెలియదు. మీరెవరో నాకు తెలుసు"

"......"

"మీరు బాధపడ్తున్నారు... ఆ విషయం నాకు తెలుసు"

"రెండు విషయాల గురించి మీరు వేదన చెందుతున్నారు...'

"... ...."అతని కళ్ళలో ఆశ్చర్యం ప్రతిఫలించి అతనికి తెలియకుండానే అతను ఆమెవ్యక్తిత్వ క్షేత్రంలోకి ప్రవేశిస్తున్నాడు.

"ఒకటి - ఎలా బ్రతకాలి. రెండు.. ఈ నెలరోజులుగా ఉద్యోగం కోసం తిరిగి తిరిగి అలసిపోయిన నాకు ఈ వ్యవస్థ ఎందుకు గుర్తింపివ్వడం లేదు. మేధావిగా ఈ సంఘం ఎందుకు గౌరవమివ్వడం లేదు.. అదీ మీ బాధ "

"ఎగ్జాక్ట్లీ కరెక్ట్... యువార్ రైట్.. అదే...' అన్నాడు ఉద్విగ్నంగా..

" ఐతే ఈ సంఘం ఎందుకు మిమ్మల్ని గౌరవించాలి."

ఊహించని ప్రశ్న. చటుక్కున సమాధానం స్ఫురించని ప్రశ్న.

" ఒకటే మీకు మనవి చేస్తున్నాను... మనం ఏం చేయాలన్నా ముందు అసలు మనకు ఏం కావాలో స్పష్టమైన ఆలోచన ఉండాలి. మన లక్ష్యం మన ఎదుట నిర్దుష్టమైన రూపంలో ప్రజ్వలిస్తూ ఉండాలి. ప్రస్తుతం మీరు మీకే తెలియని, మీకేంకావాలో నిర్ణయించుకోలేని అస్పష్టతలో ఉన్నారు. సంఘం గురించీ, అది మనకు ఇవ్వవలసిన గుర్తింపు గురించీ ధీరుడైనవాడు విచారించడు. సంఘాన్ని మనం శాసించాలి. సంఘం అనివార్యంగా మనను గౌరవించే పరిస్థితులను మనమే సృష్టించుకోవాలి. సంఘానికి మీ అవసరం ఉందని మీరు ప్రూవ్ చేస్తే మిమ్మల్ని గౌరవిస్తుంది. లేదా మీరేదైనా అద్భుతం చేస్తే తనను తాను గౌరవించుకోవడం కోసం సంఘం మిమ్మల్ని గౌరవిస్తుంది... ఏమంటారు..."

"ఎగ్జాక్ట్లీ కరెక్ట్... నాకేం కావాలో నాకే స్పష్టంగా తెలియదనే విషయం యిప్పుడే తెలుస్తోంది..."

" మీకేం కావాలో నేను చెబుతానిప్పుడు"

"... ..." అవాక్కవుతున్నాడు పార్థుడు.

" ముందు బతుకుతెరువు చూచుకోవాలి... ఎలా...."

" అదే అర్థంకావడంలేదు.ఎంత ప్రయత్నించినా ఎవరూ ఉద్యోగమివ్వడం లేదు"

"ఉద్యోగాన్ని ఎవరూయివ్వరు - మనమే తెచ్చుకోవాలి"

"అదెలా..."

"ఉద్యోగమంటే ఏమిటి. బ్రతగ్గలిగే ఆధారం... అంతేకదా..." ముందు మీరు రోజు గడవడానికి అవసరమయ్యే పదిహేను రూపాయల సంపాదనను వెదుక్కోవాలి. అక్కడ నుండి మీ జీవిత జైత్రయాత్ర మొదలవుతుంది. ఇప్పుడు ఏ విలువాలేని జీరో ముందు ప్రక్కన "ఒక" అంకెను చేర్చుకోగలిగితే ఎన్ని జీరోలుంటే అంత విలువెక్కువ. ఐతే "వైట్ కాలర్‌నెస్" అనే దరిద్రపు గొట్టు ఆలోచన నుండి ముందు మీకు మీరు విముక్తం కావాలి. ఇప్పుడు నేను చెబుతున్న మీ వారిని మీరు సృష్టించుకోండి, విజయం తప్పకుండా మీ పాదాల దగ్గర పొరాడుతుంది. కమాన్ గెటప్, బాధలెప్పుడూ గుండెల్లోదాచుకోవాల్సిన తీపి జ్ఞాపకాలు, దుఃఖంలో నుండే మనిషి యొక్క ఉజ్జ్వలమైన జీవితం పుడ్తుంది. లేవండి - ఉద్యమించండి... ప్రొసీడ్."

"ఏం చేయమంటారిప్పుడు నన్ను"

"ఈ రోజు పదిహేను సంపాదించండి"

"ఎక్కడ"

"కళ్ళు తెరిచి చూస్తే యిక్కడే దొరుకుతాయి మీకు..."

".... " మౌనం.

"ఇంతకుముందు వచ్చేటప్పుడు గమనించాను నేను, అదిగో, అటు చూడండి... ఆ రాళ్ళుకొట్టే మనుషుల గుంపు, అక్కడ వెంటనే ఓ మనిషి అవసరం ఉంది. కాంటాక్ట్"

"థాంక్యూ..."

డాక్టర్ పార్థుడు కదిలాడు గుండెల నిండా ఆత్మవిశ్వాసంతో....

పదినిముషాల తర్వాత....

"మళ్ళీ పదిహేనురోజుల తర్వాత కలుస్తాను" అని స్వగతంగా అనుకుంటూ వెనుదిరిగింది జయ.

సరిగ్గా అప్పుడు డాక్టర్ పార్థుడు చిన్న చిన్నరాళ్ళను కంకరగా మార్చేందుకు సుత్తితో పని చేయడం ప్రారంభించేడు.

★ ★ ★

పదిహేను రోజుల తర్వాత -

"మీరిప్పుడు ఇక మీ టాలెంట్‌ను నిరూపించాలి... అంటే గణితశాస్త్రంలో మీరు దిట్ట. అదే ప్రతిభను కమర్షియలైజ్ చేయాలి. అంటే ...ముందు మీరు గణితాన్ని ఎంత సరళంగా, అర్థమయ్యే రీతిలో విద్యార్థులకు బోధించగలరో ప్రూవ్ చెయ్యాలి"

"కాని ఎవరూ నాకు క్లాస్‌రూంలో అవకాశాన్ని ఇవ్వందే...'

ఇద్దరూ నడుస్తున్నారు.

"ఇవ్వరు - మనమే తెచ్చుకోవాలి."

" ఎలా" - అన్నట్టు చూశాడు పార్థుడు.

" సరిగ్గా ఈ రోజుకు పదిహేనురోజుల తర్వాత... అంటే నెలతర్వాత మీ దగ్గర ఎన్ని డబ్బులుంటాయి." అడిగింది జయ.

"మూడువందలు - నూటయాభై ఖర్చయి పోతాయిగా..."

"రైట్.. అందులోనుంచి హనుమాన్‌పేటలో రెండువందలు అడ్వాన్స్ ఇచ్చి రెండు విశాలమైన గదులున్న ఓ పోర్షన్‌ను మీరు అద్దెకు తీసుకుంటున్నారు. తర్వాత రెండు రోజులకు నలభై రూపాయలు ఖర్చుపెట్టి పార్థుడు ట్యుటోరియల్స్ - "నిజంగా గణితశాస్త్రం మీద అభిరుచి ఉన్న ఇంటర్మీడియేట్ విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వబడును" అన్న రెండు బేనర్స్ రాయించి జూనియర్ కాలేజి ముందుకడ్తారు... మీరే స్వయంగా కడ్తారు.."

" బాగుందీ ఆలోచన." పార్థుడి ముఖంలో వెలుగు.

జయ నవ్వి "తప్పకుండా బాగుంటుంది... మీ బేనర్ కనబడ్డాక పదిరోజులకు మళ్లీ కలుస్తాను.. బై..." అంది.

అని -

వెళ్తోంది -

పార్థుడులో హృదయంలోనుండి ఏదో జారి పోతున్నట్టు - తనేదో కోల్పోతున్నట్టు భావన.

వెంటనే తేరుకుని పదిహేను రోజుల ప్రోగ్రాంను జ్ఞప్తికి తెచ్చుకున్నాడు.

" మై ఫ్రెండ్ క్యారీ ఆన్..." అని నవ్వుతూ తండ్రి పి.ఎస్.ఎన్.స్వామి వెన్నుతడుతున్నట్టనిపించి...

అడుగు వేశాడు ముందుకు.

సరిగ్గా అప్పుడే అప్పటిదాకా ఉరిమిన ఆకాశం వర్షించడం మొదలెట్టింది.

★ ★ ★

అప్పటికి డాక్టర్ పార్థుడును ఎనిమిదిసార్లు కలిసింది జయ.

పార్థుడును కలవాలంటే బయట ఆఫీస్ గదిలో అరగంటసేపు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం ఆరునుండి 'మాథమెటిక్స్' బ్యాచెస్ మొదలు. ఇంటర్మీడియేట్, బి.ఎస్సీ, సి.ఎ, బి.టెక్ -ఎందరో. వివిధ స్థాయిలో రోజుకు ఎనిమిది బ్యాచ్‌లు. ఒక్కో బ్యాచ్‌లో దాదాపు నలభైమంది. ఒక్కో విద్యార్థికి నాల్గు వందలు చొప్పున - లక్షా యిరవై ఎనిమిదివేల చిల్లర.డబ్బే డబ్బు, నగరంలో గణితం ట్యూషన్ అంటే చాలు డాక్టర్ పార్థుడు పేరే నాలుకపై ఆడుతోంది.

"ఎంతసేపయిందివచ్చి-" అన్నాడు ఆఫీసుగదిలోకి వస్తూనే.చేతులకూ, చొక్కాకు, పాంటుకూ అక్కడక్కడ సుద్దముక్క పొడి.

" యింతకు ముందే..."

" టీ తాగుదామా... బయట సన్నగా చినుకులు పడ్తున్నాయి"

"..." ఆమె మాటడలేదు.

అతను ఫ్లాస్క్‌లోనుంచి కప్పుల్లోకి టీ వంచుతూ "లాస్ట్ బ్యాచ్ ఇది.. యిక ఫ్రీ నేను.."

" బాగా అసిపోయినట్టున్నారు.."

చటుక్కున తలెత్తి ఆమె కళ్ళల్లోకి చూసి.. నవ్వి..కప్పు అందించి.. "జీవితంలో అలసిపోవడమనేది ఉండకూడదని చెప్పింది మీరే కదా..."

ఆమె కూడా చిన్నగా నవ్వి టీ చప్పరిస్తూ..,

"సన్నగా చినుకులు పడ్తున్న వాతావరణంమంటే ఎంతో యిష్టం నాకు.." చెబుతున్నాడు..

"యిక నేను మీ వద్దకురావలసిన అవసరం ఏదీ కనిపించడం లేదు పార్థుడుగారూ.. ఇప్పుడు మీరు పూర్తిగా స్వతంత్రమైన వ్యక్తిగా ఎదిగారు. ఇక మీరు స్వతంత్రంగా ప్రయాణం చేయగలరు" చెప్పుకుపోతోంది జయ కిటికీలో నుండి వర్షం చినుకుల్లోకి చూస్తూ - పార్థుడు షాక్ తిని

"అంటే... అంటే మీరు నన్ను విడిచివెళ్తారా"

"మీతో నేనెప్పుడూ కలిసి ఉండలేదే యిప్పుడువిడిపోవడానికి.. ఐతే యిప్పుడు డబ్బును సంపాదించడం నేర్చుకున్న మీరు యిక తప్పులు చేసే అవకాశం ఉంది. ఇక మీకు తెలియకుండానే డబ్బు పిచ్చి మిమ్మల్ని జయిస్తుంది. మీరు సంఘంలో నిలబడి గుర్తింపు పొందేవరకు డబ్బు సంపాదించాలి. దాంతర్వాత మీరు చేయవలసింది... మీ ప్రతిభను ఈ దేశ సంక్షేమం కోసం పంచిపెట్టడం. యిప్పటికనుండి మీ జీవితం ఈ లక్ష్యం కోసమే సాగాలి. అదీ నా కోరిక ... ప్రామిస్ చేయండి"

"ప్రామిస్ చేయవలసిన అవసరం లేదు జయా ప్రస్తుతం నా మనసునిండా నిండివున్న విషయాన్నే మీరు ప్రస్తావించారు. అదే తప్పకుండా జరుగుతుంది"

నిశ్శబ్దం యిద్దరి మధ్య,

బయట చినుకుల చిరు సవ్వడి

" నేను ఎన్నాళ్ళ నుంచో మిమ్మల్నో విషయం అడగాలనుకుంటున్నాను జయ గారూ"

" నాకు తెలుసది..." అతనివైపు తిరిగిందామె.

అతని కళ్ళలో స్పందించే సముద్రాలు

" మీరిప్పుడు - ఐ లౌయూ అంటారు. మనం పెళ్ళి చేసుకుందామంటారు. ఔనా.." అంది.

"సరిగ్గా అంతే "

ఉత్సాహం అతనికళ్ళనిండా

"దరిద్రపుగొట్టు తెలుగు సినిమాలలాగా మన పరిచయానికి యిదా ముగింపు. పార్థుడు గారూ నేను మీతో ప్రయోగం చేయాలనుకున్నాను.మన శక్తిని మనమే మరచిపోయే తత్వంలో నాశనం కాకుండా హ్యూమన్ ఎబిలిటీని వెలికి తీయడం ఎలా ఉంటుందో మీతో ప్రయత్నించాను. యిలాంటివి యింకెన్నో చేయవలసి ఉంది నేను. ఆ క్రమంలో ఎంత మందిని పెళ్ళి చేసుకుంటాను నేను చెప్పండి. జయించండి ఈ సెంటిమెంట్స్‌ని. వుయ్ విల్‌బి ఓన్లీ ఫ్రెండ్స్..."

బయట వర్షం తగ్గుతున్నట్టుంది.

జయ బయటకు చూస్తూ.. చేయి చాచి చినుకుల ఉధృతిని చూచి" -రైట్ వస్తాను... గుడ్‌బై మై ఫ్రెండ్.." అని...

వెళ్తోంది.. ఎంతోసాదాగా, స్థిరంగా మనిషి రూపంలో ఉన్న విశ్వాసంలా.

క్షణంసేపు సిగ్గుపడ్డ డాక్టర్ పార్థుడు మరుక్షణం తృప్తితో, గర్వంతో, కళ్ళనిండా కన్నీళ్ళతో

"గుడ్‌బై మై ఫ్రెండ్" అని గొణుక్కుంటున్నాడు.

'పల్లకి' వారపత్రిక

05-03-1987